### • గోడను ఢీకొట్టిన యుటిలిటీ ట్రాక్ వెహికిల్

పెద్దపల్లి జిల్లా రామగుండంలో రైల్వేస్టేషన్‌లో యార్డు ఏరియాలో 46 ఖాళీ వ్యాగన్లకు మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు, శనివారం తెల్లవారుజామున వాటిని ఆర్‌వోహెచ్ సిక్ లైన్ నుంచి రన్నింగ్ లైన్‌లోకి తీసుకొచ్చారు. వాటిని నిలపాలనుకున్న పాయింట్ నుంచి 100 మీటర్లు ముందుకు దూసుకెళ్లి ముందున్న యుటిలిటీ ట్రాక్ వెహికిల్‌ను ఢీకొట్టాయి. దీంతో ఆ వెహికిల్ సైతం ముందుకు వెళ్లి అడ్డుగా ఉన్న సిమెంట్ గోడ మీదకు ఎక్కింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

– జ్యోతినగర్ (రామగుండం)



## ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

వికారాబాద్, జనవరి 13 : వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో వస్తూ అనంతగిరి ఘాట్ వద్ద అదుపు తప్పింది. బస్సు డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం బస్సు హైదరాబాద్ నుంచి తాండూరు వెళ్తుంది. ఇందులో 92 మంది ఉన్నారు. బస్సు వికారాబాద్ అనంతగిరి ఘాట్ రోడ్డు వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ రఫీ చాకచక్యంతో ప్రయాణికులను కాపాడేందుకు బస్సును రోడ్డు దింపి పొదల్లోకి తీసుకెళ్లి నిలిపాడు. మొత్తం 9 మందికి గాయాలయ్యాయి.

# వారంలో ఆస్ట్రేలియాకు.. అంతలోనే..

పెద్దపల్లి రూరల్, జనవరి 13 : వారం రోజుల్లో ఆస్ట్రేలియాకు వెళ్లాల్సిన ఓ యువకుడు తాను నడుపుతున్న కారు బావిలోకి దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయాడు. పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రంగంపల్లిలో నివాసం ఉంటున్న తుమ్మ విజయపాల్‌రెడ్డి-విజయ దంపతులకు వినీత్‌రెడ్డి(27), విక్రమ్‌రెడ్డి ఇద్దరు కొడుకులు. వినీత్‌రెడ్డి ఉద్యోగ రీత్యా ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. క్రిస్మస్ సెలవులకు పెద్దపల్లికి వచ్చిన వినీత్‌రెడ్డి ఈ నెల 20న ఆస్ట్రేలియా వెళ్లాలనుకున్నారు. శుక్రవారం తమ సొంతూరైన గుంటూరుపల్లికి వెళ్లారు. అక్కడ కుటుంబసభ్యులు, బంధువులను కలిసి సరదాగా గడిపారు. అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల ప్రాంతంలో మరో ముగ్గురితో కలిసి కారులో బయలుదేరారు. పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి శివారులో పెద్దకల్వలకు వెళ్లే మార్గంలో కారు అదుపు తప్పి పక్కనున్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సాయితేజరెడ్డి అనే వ్యక్తి బయటకు వచ్చి కారు అద్దాలను బండరాయితో పగుల గొట్టడంతో మరో ఇద్దరిని లాగడంతో వారు పైప్ సహాయంతో పైకి చేరుకున్నారు. కారు నడుపుతున్న వినీత్‌రెడ్డి(27) సీటు బెల్టు పెట్టుకోవడంతో బయటకు రాలేక బావిలోనే మృతి చెందాడు. వినీత్‌రెడ్డి మృతదేహాన్ని శనివారం తెల్లవారుజామున వెలికితీశారు.



వినీత్‌రెడ్డి (ఫైల్)



పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి శివారు బావిలో పడ్డ కారును క్రేన్ సహాయంతో తీస్తున్న ఫైర్ సిబ్బంది

### అనుమానాస్పదస్థితిలో భార్య ఆత్మహత్య..

# భర్తను చంపేసిన బంధువులు

- మూడేండ్ల కిందట ప్రేమ పెండ్లి చేసుకున్న జంట
- ఆర్థిక సమస్యలతో తరచూ దంపతుల మధ్య గొడవ
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో తీవ్ర విషాదం

అచ్చంపేట, జనవరి 13: పెద్దలను ఎదురించి మూడేండ్ల కిందట ఆర్యసమాజ్‌లో ప్రేమ పెండ్లి చేసుకున్నది ఓ జంట. అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్న ఆ దంపతులు.. కొంతకాలం బాగానే ఉన్నా.. ఇటీవల ఆర్థిక సమస్యలు తలెత్తి తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన యువతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు ఆ యువకుడిని దారుణంగా కొట్టి చంపారు. దీంతో సంక్రాంతి సంతోషం నిండాల్సిన వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఈ ఘటన శనివారం నాగకర్నూల్ జిల్లా అచ్చంపేటలో సంచలనం సృష్టించింది. లింగాల మండలం చెన్నంపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ అరుణబాయి, శ్రీనివాసులు కుటుంబం అచ్చంపేటలో నివాసం ఉంటున్నది. శ్రీనివాసులు ఎల్‌ఐసీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. వారి కుమార్తె అత్తికారి సింధు (26) డిగ్రీ చదివింది. అదే కళాశాలలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం అన్నాసాగర్‌కు చెందిన తోట నాగార్జున (30) కూడా అదే కళాశాలలో డిగ్రీ చదివాడు. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా.. ఈ పెండ్లి వద్దని ఆమె తల్లిదండ్రులు ఎన్నోసార్లు మనస్సు మార్చే ప్రయత్నం చేసినా యువతి వినిపించుకోలేదు. పెద్దలను ఎదురించి ఆర్యసమాజ్‌లో ఇద్దరూ పెండ్లి చేసుకున్నారు. దీంతో యువతి తల్లిదండ్రులు ఆమెతో మాట్లాడటమే మానేశారు.



మృతిచెందిన జంట సింధు, నాగార్జున (ఫైల్)

#### ఆర్థిక సమస్యలతో మనస్పర్థలు

అచ్చంపేట పట్టణంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ.. నాగార్జున స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తుండగా.. సింధు టీటీసీ పూర్తి చేసి టెట్‌కు ప్రిపేరవుతున్నది. నాగార్జున ఎక్కువగా స్నేహితులతో బయట సరదాగా తిరిగేవాడు. కుటుంబం గడవడమే కష్టంగా మారి తరచూ ఇద్దరి మధ్య గొడవ జరిగేది. శుక్రవారం కూడా ఇద్దరూ ఘర్షణపడ్డారు. మనస్తాపానికి గురైన సింధు కోపంతో గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నది. నాగార్జున వెంటనే దవాఖాన సిబ్బందికి విషయం చెప్పడంతో అందరూ వచ్చి తలుపులు బద్దలుకొట్టారు. డాక్టర్ కృష్ణ వెంటనే సీపీఆర్ చేసి కొన ఊపిరితో ఉందని చెప్పగా నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వెంటిలేటర్ ఉన్న అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అప్పటికే సింధు మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు.

#### యువకుడిని కారులో తీసుకెళ్లి హత్య

సింధు మృతదేహాన్ని అంబులెన్స్‌లో హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు తీసుకొస్తున్న క్రమంలో.. మృతురాలి కుటుంబసభ్యులు మరో కారులో వచ్చి రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు వద్ద అంబులెన్స్‌ను ఆపారు. నాగార్జునను తమ కారులో ఎక్కించుకుని దూరంగా తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేస్తూ తీవ్రంగా కొట్టారు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక మరో తుఫాన్ వాహనంలో మృతదేహాన్ని అచ్చంపేటకు తరలించి ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో వదిలి పారిపోయారు. యువతి మృతదేహంతో వచ్చిన అంబులెన్స్‌లో భర్త నాగార్జున లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి ఆరా తీశారు. ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో వాహనం ఆగి ఉన్నదన్న సమాచారంతో అక్కడికెళ్లి చూడగా.. ఆ వాహనంలో యువకుడు విగతజీవిగా కనిపించాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారించగా ఆత్మహత్య చేసుకున్న సింధు భర్త నాగార్జునగా తేలింది. శనివారం ఉదయం ఇరు కుటుంబాల సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు అచ్చంపేట సీఐ అనుదీప్, ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మృతదేహాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## ఒకటివెనుక ఒకటి ఢీకొని.. కల్వర్టులో పడి



శనివారం శంషాబాద్ మండలం ఘాన్సిమియాగూడ వద్ద కల్వర్టులో పడిన కారు, ఆటో, వృత్తంలో బైక్

శంషాబాద్ రూరల్, జనవరి 13: ఒకటి వెనుక ఒకటి ఢీకొనడంతో కారు, ఆటో, బైక్ నిర్మాణంలో ఉన్న ఓ కల్వర్టులో బోల్తాపడ్డాయి. ఈ ఘటన శనివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో శంషాబాద్ మండలంలోని ఘాన్సిమియాగూడ గ్రామసమీపంలో కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండు కోసం నగరంలో ఉన్న వారు సొంతూర్ల వెళ్తున్నారు. ఘాన్సిమియాగూడ గ్రామ సమీపంలోకి రాగానే అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో బైక్ ముందుగా వెళ్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఈ మూడు వాహనాలు రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టు గుంతలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మేరువ ఆదిశేషారెడ్డి (57), ఆయన తల్లి రాములమ్మ (88) మరణించారు. కాగా బైక్‌పై ఉన్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ అంజి, అతడితో పాటు అక్షిత అనే బాలికకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి.



దగ్ధమైన వోల్వో బస్సు.. సజీవ దహనమైన మాలతి (ఫైల్)



### ట్రావెల్ బస్సులో మంటలు..

# మహిళ సజీవదహనం

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 13 : జోగులాంబ గద్వాల జిల్లాలో ట్రావెల్ బస్సు బోల్తాపడి మంటలు రావడంతో మహిళ సజీవదహనమైంది. అమెజాన్ జగన్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు శుక్రవారం రాత్రి 7:30 గంటలకు హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి ఏపీలోని చిత్తూరుకు వెళ్తుంది. ఇందులో మొత్తం 34 మంది ప్రయాణికులు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. మధ్యరాతి 2.30 గంటల ప్రాంతంలో జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం టెన్త్ బెటాలియన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో అదే క్రమంలో లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. అప్రమత్తమైన ప్రయాణికులు బస్సులోంచి బయటకు వచ్చారు. మెహిదీపట్నంకు చెందిన మాలతి (40) బస్సులోని సీటు కింద ఇరుక్కుపోయింది. కేకలు విన్న తోటి ప్రయాణికులు శతవిధాలా ప్రయత్నించారు. వెంటనే షార్ట్ సర్క్యూట్‌తో బస్సులో పొగలు రావడంతో భయంతో వారు బయటకు వెళ్లిపోగా.. అకస్మాత్తుగా మంటలు అంటుకుకొని బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఆ మంటల్లోనే ఆమె సజీవ దహనమైంది. కాగా ఇమ్రాన్ అనే యువకుడు ప్రాణాలను పణంగా పెట్టి ఐదుగురు ప్రయాణికులను కాపాడారు.



ఐదుగురిని కాపాడిన ఇమ్రాన్

